క్లుప్తంగా

చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి దంపతులు

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు గిరిజన కాలనీలో కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి దంపతులు సుమారు 400 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. చిన్నారులకు బిస్కెట్లు అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ పిల్లలను బాగా చదవించాలని తల్లిదండ్రులను కోరారు. సర్పంచ్ సంగం వెంకయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై కేసు నమోదు

ఇందుకూరుపేట : పొలంలో చెట్ల నరికివేతపై మండలంలోని కొత్తూరుకు చెందిన తిమ్మిరెడ్డి మాధవ్ ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. పాత వివాదాల నేపథ్యంలో పాములవారిపాళేనికి చెందిన మహేష్, సుధాకర్, జంషీర్‌లు కొబ్బరి, అరటి, తాటి, జామచెట్లను నరికివేసి విక్రయించినట్లు మాధవ్ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. విచారణ జరుగుతోందని తెలిపారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు అవకాశం కల్పించరూ..

నెల్లూరు (అర్బన్): సాధారణ డిగ్రీ, బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు ఏపీపీఎస్సీ పరీక్షలకు అవకాశం కల్పించాలని ఎమ్మెస్‌డబ్ల్యూ సొసైటీ జిల్లా అధ్యక్షుడు మస్తానయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఆలోచించి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నెల్లూరు(బృందావనం): నవాబుపేటకు చెందిన చిన్నారి భవ్య హాసిని తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరుని సన్నిధిలో జూలై 16న ఐదు గంటల పాటు నాట్య ప్రదర్శనతో చేపట్టనున్న గిరి ప్రదక్షిణ విజయవంతం కావాలని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి కాంక్షించారు. సాధనలో భాగంగా నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో నాట్య ప్రదర్శనను భవ్యహాసిని శుక్రవారం నిర్వహించారు. తొలుత కళాదీప్తి చిన్నారులు వేద అక్షయ, హసీష, గ్రీషిత, దేదీప్య, విశ్వతేజ, పర్ణిక, హాన్విక, శుభాంజలి, రీతు రాయల్‌తో నృత్య ప్రదర్శనతో అలరించారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభంకానున్నాయి. అంకురార్పణను శనివారం, తీర్థవాదిని జూలై నాలుగున నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

నమ్మకంగా ఉంటూ ఆభరణాలు దోచేసి..

నెల్లూరు(క్రైమ్): ఇంటి యజమానులతో ఓ మహిళ నమ్మకంగా ఉంటూ ఆభరణాలను దోచేసిన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. గౌడ హాస్టల్ సెంటర్‌లో నివాసం ఉంటున్న శివప్రసాద్‌రావు ఇంట్లో ఓ మహిళ ఏడు నెలల క్రితం అద్దెకు చేరారు. శివప్రసాద్‌రావు దంపతులతో ఆమె ఎంతో సన్నిహితంగా ఉండేవారు. శివప్రసాద్‌రావు భార్య తన బంగారు ఆభరణాలను కప్‌బోర్డులో ఏప్రిల్‌లో పెట్టడాన్ని సదరు మహిళ గమనించారు. మరుసటి రోజు మార్నింగ్ వాక్‌కు దంపతులు వెళ్లగా, కప్‌బోర్డులో ఉంచిన రూ.3.5 లక్షల విలువజేసే బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. దీంతో సదరు మహిళపై బాధితులకు అనుమానం వచ్చింది. పెద్దల సమక్షంలో నిలదీయగా, తానే వాటిని అపహరించానని, త్వరలోనే వాటిని తిరిగిచ్చేస్తానని చెప్పారు. రోజులు గడుస్తున్నా ఆభరణాలను తెచ్చివ్వకపోవడంతో పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీకి గురైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని ఎంజీబీ మాల్ బయట సరస్వతీనగర్‌కు చెందిన శివశంకర్ తన హీరో స్ప్లెండర్ బైక్‌ను ఈ నెల 19వ తేదీ రాత్రి నిలిపారు. అనంతరం వచ్చేసరికి బైక్ అదృశ్యమైంది. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడప గడపలో ఆత్మీయత

• ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(విడవలూరు) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపలో ప్రజలు ఆత్మీయంగా పలుకరిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. విడవలూరు మండల కేంద్రంలోని సచివాలయం–2 పరిధిలో జాన్‌పేట, మన్మధరావుపేట, దళితవాడ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్న శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత 157 రోజుల నుంచి పర్యటిస్తున్నానని, ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఎంతో ఆప్యాయంగా స్వాగతం పలుకుతున్నారని, ఈ ప్రభుత్వంలో ఎంతో సంతోషంగా ఉన్నామని వెల్లడిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు మన రాష్ట్రంలోనే అమలవుతున్నట్లు చెప్పారు. ఆ నిధులతో సత్వరమే సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా స్థానికులు సైడ్ డ్రెయిన్‌లు కావాలని ఎమ్మెల్యేను కోరగా, వెంటనే వాటి నిర్మాణానికి రూ.9 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎస్‌ఎస్‌ఆర్ ట్రస్టు ద్వారా రూ.40 వేలు వితరణ

మండలంలోని ముదివర్తి గ్రామంలో ఎమ్మెల్యే ప్రసన్న పర్యటిస్తుండగా తల్లిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులు కొంగల మయూరి, సాత్విక్‌కు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు తరఫున రూ 20 వేల చొప్పన ముదివర్తి సొసైటీ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అందుకు సంబంధించిన బాండ్లను చిన్నారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పూండ్ల అచ్చుతరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కొమ్మల లక్ష్మయ్య, ఎంపీపీ భవానమ్మ, సర్పంచ్ పద్మావతమ్మ, నేతలు పాశం శ్రీహరిరెడ్డి, తిరుపతి, మస్తానయ్య, లక్ష్మీనారాయణ రెడ్డి, సురేందర్‌రెడ్డి, సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

కుష్టుకు ప్రాథమిక దశలోనే నివారణ



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న నోడల్ ఆఫీసర్

• లెప్రసీ నోడల్ ఆఫీసర్ నరసారెడ్డి

కొడవలూరు: ప్రాథమిక దశలోనే కుష్టును పూర్తిగా నివారించవచ్చని లెప్రసీ నోడల్ ఆఫీసర్ నరసారెడ్డి తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని రాగి రంగు మచ్చలుంటే కుష్టు లక్షణాలుగా గుర్తించాలన్నారు. అదేవిధంగా ముఖంపై బొబ్బర్లు ఉన్నా కుష్టు లక్షణాలుగా పరిగణించి పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి ముదరడం వల్ల నివారణ కష్టతరంగా మారడంతో పాటు కాలవ్యవధి పట్టే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో పర్యటించే వైద్య సిబ్బంది ఏ మాత్రం అనుమానం ఉన్నా వెంటనే పీహెచ్‌సీలో పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీ ఉద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మనుబోలు ఎంఈఓ–2గా రమేష్‌కుమార్



బాధ్యతలు చేపట్టిన రమేష్‌కుమార్

మనుబోలు : మండల రెండో విద్యాశాఖాధికారిగా ఏవీ రమేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఈయన మనుబోలులో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా చిట్టేడు ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తూ పదోన్నతిపై మనుబోలుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్‌ను పలువురు హెచ్‌ఎంలు, విద్యాశాఖ సిబ్బంది అభినందించారు.

మనుబోలు తహసీల్దార్ బదిలీ

• మంత్రి కాకాణి పర్సనల్ అసిస్టెంట్‌గా నియామకం



కాకాణికి పుష్పగుచ్ఛం ఇస్తున్న లక్ష్మీనారాయణ

మనుబోలు : మనుబోలు తహసీల్దార్ లక్ష్మీనారాయణ బదిలీ అయ్యారు. ఆయనను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యక్తిగత సహాయకునిగా నియమిస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో లక్ష్మీనారాయణ శుక్రవారం మంత్రి కాకాణిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాగా చేజర్ల తహసీల్దార్‌గా పనిచేస్తున్న శివకృష్ణను మనుబోలు తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

పక్కాగా జగనన్న సురక్ష



తోటపల్లిగూడూరు : సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న మండలాధికారులు



కోవూరు : సీఎం సందేశాన్ని వింటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తోటపల్లిగూడూరు : 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ హేమలత పేర్కొన్నారు. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించగా, స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో పరిష్కారం నోచుకోని ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారం చూపాలని వెల్లడించారు. ప్రతి సచివాలయ పరిధిలో నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, తహసీల్దార్ హమీద్, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సురక్ష అమలుకు ప్రత్యేకాధికారులు

ముత్తుకూరు : మండలంలోని 16 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం సక్రమంగా అమలు చేసేందుకు శుక్రవారం ప్రత్యేక అధికారులను నియమించారు. ఇందులో భాగంగా నారికేళపల్లి, పొట్టెంపాడు, నేలటూరు, బ్రహ్మదేవి-1, మునునూరువారిపాళెం సచివాలయాల బాధ్యతను ఏఎస్‌ఓ వాసుదేవరావు, ఎంఏఓ జ్యోత్స్నారాణిలకు అప్పగించారు. ముత్తుకూరు-1, కృష్ణపట్నం, ముత్తుకూరు-2, దొరువులపాళెం, ముత్తుకూరు-3, తాళ్లపూడి సచివాలయాలకు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఏఓ జ్యోత్స్నారాణిలకు అప్పగించారు. అలాగే మల్లూరు, పిడతాపోలూరు, వల్లూరు, బ్రహ్మదేవి-2, పంటపాళెం సచివాలయాలను ఈఓపీఆర్డీ హేమంత్, ఎంఈఓ మధుసూదనలకు అప్పగించారు.

అందరికీ ప్రయోజనం

కొడవలూరు: జగనన్న సురక్ష కార్యక్రమం అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య అన్నారు. మండలంలోని గుండాలమ్మపాళెం ఆర్బీకేలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న అనేక సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. జనన, మరణ ధ్రువీకరణలతో పాటు రేషన్ కార్డు, కరెంట్ బిల్లు పేరు మార్పు తదితర సమస్యలతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరి సమస్యలను పరిష్కరించేందుకు జగనన్న సురక్ష దోహదపడుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్‌లు నాగేంద్రప్రసాద్‌రెడ్డి, మధుసూదన్‌రావు, వీఏఏ విష్ణుప్రియ, డిజిటల్, వెల్ఫేర్ సహాయకులు రాజేష్, ఒసామా, నాయకుడు పానేటి శీనయ్య పాల్గొన్నారు.



కొడవలూరు: కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నేతలు, సచివాలయ సిబ్బంది

పకడ్బందీగా నిర్వహించాలి

కోవూరు : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం మండలాధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. దీని ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు సర్వీసు చార్జీలు లేకుండా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల ఉపాధ్యక్షుడు నర్సింహులురెడ్డి, ఎంపీటీసీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, పార్టీ నేత కిశోర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తోటపల్లిగూడూరు : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బాలకృష్ణ సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, పోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అనే అంశాలపై కోడూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో విద్యార్థులకు ఎస్‌ఈబీ అధికారులు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈబీ సీఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకొంటున్నారన్నారు. వీటి విషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉన్నతంగా చదివి తల్లిదండ్రుల కీర్తి ప్రతిష్టలను కాపాడాలన్నాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక కళాశాల ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ, మహిళా పోలీసులు నికిత, శ్రావణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మనుబోలుకు మంత్రి కాకాణి

మనుబోలు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం మనుబోలుకు రానున్నారు. స్థానిక డీపీఆర్ కల్యాణ మండపంలో సాయంత్రం 4 గంటలకు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. అందరూ తప్పక హాజరు కావాలన్నారు.

లక్ష్మీదేవికి కుంకుమ పూజ

పొదలకూరు : పట్టణంలోని లక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహిళలు శుక్రవారం లక్ష్మీదేవికి కుంకుమ పూజ నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహిస్తామని ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ పేర్కొంది.

విద్యార్థినికి అభినందన



కోవూరు: మండలంలోని ఇనమడుగు ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆదూరి రమోలా నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించారని పాఠశాల హెచ్‌ఎం విమలకుమారి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని శుక్రవారం పాఠశాలలో అభినందించారు. రాబోయే తరగతుల్లో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

ఈపూరు విద్యార్థికి నవోదయలో సీటు



రామతేజ్

ముత్తుకూరు : మండలంలోని ఈపూరు గ్రామానికి చెందిన తైదుపాటి మోక్షజ్ఞ రామతేజ్ అనే విద్యార్థికి నవోదయ స్కూల్‌లో సీటు లభించింది. ఈ మేరకు ఆరో తరగతిలో చేరేందుకు తండ్రి వీరరాఘవయ్యకు శుక్రవారం పిలుపు అందింది. ఏప్రిల్ 23వ తేదీన ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్‌లో ఈ విద్యార్థి ప్రవేశ పరీక్షకు హాజరయ్యాడు.

చిన్నారులకు వైద్యపరీక్షలు



పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎం.రమేష్ పర్యవేక్షణలో శుక్రవారం చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యనిపుణురాలు డాక్టర్ వెన్నల పిల్లలకు పరీక్షలు నిర్వహించి ఎదుగుదల లేని పిల్లలకు మందులు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు మొత్తం 105 మంది పిల్లలను వైద్యపరీక్షలకు తీసుకొచ్చారు. వీరిలో ఎనిమిది మందిని ఎన్ఆర్‌సీ(న్యూట్రీషియన్ రిహాబిటేషన్ సెంటర్)కు తరలించారు. ఇకపై ప్రతి శుక్రవారం పోషకాహార లోపం కలిగిన పిల్లలను గుర్తించి ఎన్ఆర్‌సీకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి.నరసింహారావు, డాక్టర్ వి.కావ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణభారత్‌లో వెంకయ్య జన్మదిన వేడుక



కేక్ కట్ చేస్తున్న ట్రస్టు సిబ్బంది

వెంకటాచలం: వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టులో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు చాక్లెట్లు పంచిపెట్టారు. ఈ వేడుకల్లో ట్రస్టు కోఆర్డినేటర్ జనార్ధన్‌రాజు, మేనేజర్ వేణుగోపాల్, స్వర్ణభారత్ విద్యామందిర్ ప్రిన్సిపల్ సులోచన, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం



కొడవలూరు: సత్కారం అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం



కోవూరు : ఇనమడుగు జెడ్పీహెచ్‌ఎస్‌లో..

కొడవలూరు: మండలంలోని కొత్తవంగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సత్కరించారు. పాఠశాలలోని దేవళ్ల సింధు, పగడాల విష్ణు, తాటిచెట్ల భానుతేజ ఉత్తమ ప్రతిభ చూపడంతో వారికి నగదు పురస్కారం, ప్రశంసా పత్రం, మెడల్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరామ్‌కుమార్, విద్యాకమిటీ చైర్మన్ చక్కా వంశీ, వైఎస్సార్‌సీపీ నేత చక్కా మనోహర్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు నంబూరి ప్రసాద్, నేతలు కొనిజేటి శేషగిరిరావు, గంధం సురేష్, వేముల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

• **కోవూరు :** మండలంలోని ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా నగదు ప్రోత్సాహకాన్ని సర్పంచ్ దామెర్ల ప్రమీల చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమలో హెచ్‌ఎం రాధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాటలు, డ్యాన్స్ పోటీలు రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): బయ్యా వెంకటరమణయ్య, సరోజనమ్మ స్మృత్యర్థం నగరంలోని పురమందిరంలో కళానీరాజనాన్ని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్నామని నిర్వాహకులు పెంచలరెడ్డి, రఘురామిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిర ప్రాంగణంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. పాటలు, డ్యాన్స్ పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేయనున్నామని వివరించారు. పలువురు సీనియర్ గాయకులతో సంగీత విభావరి, కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. మల్లికార్జున, రమణయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఏర్పాటుకు సహకరించాలని వినతి

నెల్లూరు(బృందావనం): రూరల్ పరిధిలో రోటరీ క్లబ్ రెండో శ్మశాన వాటిక ఏర్పాటుకు సహకరించాలని రోటరీ క్లబ్ నెల్లూరు అధ్యక్షుడు కొండా శేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. కాగా ఈ అంశమై ఎంపీ సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.